క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 2న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. టీచర్స్ కాలనీ, బ్యాంక్ కాలనీ, చైతన్యపురి కాలనీ, రాఘవేంద్రనగర్ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ రోడ్డు, వడ్డెపల్లి క్యాథలిక్ చర్చి, పింగిళి జూనియర్ కళాశాల, జవహర్ కాలనీ, సురేంద్రపురి కాలనీ, విష్ణుపురి కాలనీ, ఉషోదయ కాలనీ, ఎస్వీఎస్ హోమ్స్, మారుతి కాలనీ, ద్వారకసాయి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాంపూర్ ఇండస్ట్రియల్ ప్రాంతంలో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు తెలిపారు.

4న భగవద్గీత శ్లోక పఠన పోటీలు

వరంగల్: ములుగురోడ్డు సమీపంలోని సప్తగురుధామంలో ఆగస్టు 4న భగవద్గీత శ్లోక పఠన పోటీలు నిర్వహించనున్నట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ త్రిపురనేని గోపీచంద్ తెలిపారు. ఆసక్తిగల వారు 98484 23133 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

9న నాగుల పంచమి వేడుకలు

హన్మకొండ కల్చరల్: వరంగల్ సుభాష్‌నగర్ ఉర్సు నాగేశ్వరస్వామి దేవాలయంలో ఈనెల 9న నాగుల పంచమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్చకుడు జాగర్లపూడి శ్రీరామశర్మ ఆధ్వర్యంలో శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఉదయం 4గంటల నుంచి సుప్రభాత సేవ, గణపతిపూజ, నవరసాభిషేకం, అలంకరణ అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10గంటలకు హవనం, పూర్ణాహుతి, వేద పారాయణం, సాయంత్రం ఆరాధన, మంగళహారతి జరుగుతాయని తెలిపారు.

ట్రెజరీ డీడీకి శుభాకాంక్షలు



హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా ట్రెజరీ డిప్యూటీ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆకవరం శ్రీనివాసకుమార్‌ను తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో అసోసియేషన్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. టీజీవోస్ హనుమకొండ జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కోశాధికారి ఈగ వెంకటేశ్వర్లు, నాగ నారాయణ, రాష్ట్ర కార్యదర్శులు కిరణ్‌కుమార్, కోల రాజేష్‌కుమార్, అన్వర్ హుస్సేన్, చంద్రశేఖర్, రవీంద్ర, రాజేష్‌కుమార్, రవి ప్రసాద్, శ్రీనివాసులు, ఈశ్వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్ శోభాదేవికి సన్మానం

ఖిలా వరంగల్: హుస్నాబాద్ గర్ల్స్ జూనియర్ కళాశాలకు వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కందుల శోభాదేవి బదిలీ అయ్యారు. రంగశాయిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు గూడూరు కమలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ బదిలీ అయ్యారు. గురువారం జరిగిన వీడ్కోలు సమావేశంలో అధ్యాపకులతో కలిసి ప్రిన్సిపాల్ శోభాదేవిని విశ్వనాథ, శంభునిపేట కాలనీల అధ్యక్షుడు రవీందర్ సన్మానించారు.

డిటెన్షన్ ఎత్తివేయాలని వినతి

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల (అటానమస్)లో డిగ్రీ కోర్సుల్లో డిటెన్షన్ విధానాన్ని ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్ కోరారు. ఈమేరకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాలలో పలు కోర్సుల్లో కొంతమంది విద్యార్థులు డిటెన్షన్ అయ్యారని తెలిపారు. వారిని వెంటనే ప్రమోట్ చేయాలని కోరారు. కార్యక్రమంలో అరుణ్, అజయ్ విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనదారులకు జరిమానా

రామన్నపేట: లైసెన్స్ లేకుండా వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనం నడుపుతూ పట్టుబడిన ఓ వాహనదారుడికి వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి రూ.1500 జరిమానా విధిస్తూ గురువారం తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 19 మందికి రూ.24 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు వెల్లడించినట్లు వివరించారు.

కేయూలో తీజ్ ఉత్సవాలు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో బంజారా తీజ్ నవరాత్రి ముగింపు ఉత్సవాలను బంజారా విద్యార్థులు, ప్రొఫెసర్లు, బంజారా సంఘం ప్రతినిధులు క్యాంపస్‌లోని ప్రిన్సిపాల్ కార్యాలయం సమీపంలో గురువారం రాత్రి నిర్వహించారు. వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, క్యాంపస్ ప్రిన్సిపాల్ సురేష్‌లాల్, ప్రొఫెసర్ హనుమంతు, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ వీరన్న నాయక్, బంజారా సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధి దీపాలు.. ఇబ్బందుల్లో జనం



న్యూశాయంపేటలో వెలగని వీధి దీపాలు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలంలోని న్యూశాయంపేటలో వీధి దీపాలు వెలగడం లేదు. కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాలకు అనుసంధానంగా బైపాస్‌గా ఉంది. దాంతో నిత్యం వేలాదిమంది ప్రయాణికులు, వాహనదారులు న్యూశాయంపేట నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. వీధి దీపాలు వెలగడం లేదని విద్యుత్ సిబ్బందికి విన్నవిస్తే వీధి దీపాల బాధ్యత తమది కాదని, మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదు చేయాలని వారు ఉచిత సలహాలు ఇస్తున్నారని స్థానికులు వాపోయారు.



దర్గా రోడ్డులో అలుముకున్న చీకటి

దర్గా రోడ్డులో అంధకారం

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్ నుంచి దర్గా జంక్షన్‌కు వెళ్లే మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు. దాంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫాతిమానగర్ సెయింట్ గ్రాబ్రియల్ స్కూల్ నుంచి ఫాతిమా సెయింట్ ఆన్స్ ఆస్పత్రి వరకు వీధి లైట్లు వెలగకపోవడంతో చీకటిలోనే ప్రజలు ప్రయాణాలు సాగిస్తున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

డ్రగ్స్ రహిత కమిషనరేట్‌కు సహకరించాలి

హసన్‌పర్తి: డ్రగ్స్ రహిత కమిషనరేట్‌గా తీర్చిదిద్దడానికి ప్రతిఒక్కరు సహకరించాలని నగర పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా కోరారు. గంజాయితో పాటు ఇతర మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టాలపై కాకతీయ యూనివర్సిటీ పోలీసుల ఆధ్వర్యంలో కిట్స్ కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ మత్తు పదార్థాల వినియోగంతో భవిష్యత్ అంధకారంలోకి వెళ్తుందని అన్నారు. కొంతమంది వ్యక్తులు సంపాదన కోసం గంజాయిని విక్రయిస్తూ యువత జీవితాలతో చెలగాటమాడుతున్నారని చెప్పారు. డ్రగ్స్ విక్రయాలపై 87125 84473 నంబర్‌కు కాల్ చేసి సమాచారం అందిస్తే నగదు పురస్కారం ఇవ్వడమే కాకుండా వారి



మాట్లాడుతున్న సీపీ అంబర్ కిశోర్‌ఝా

పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, స్పెషల్ బ్రాంచీ ఏసీపీ జితేందర్‌రెడ్డి, నార్కోటిక్ విభాగం ఏసీపీ సైదులు, కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి, కేయూ ఇన్‌స్పెక్టర్ సంజీవ, సురేష్ పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించండి



సెక్యూరిటీ గార్డులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్

కేయూ క్యాంపస్: అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని సెక్యూరిటీ సర్వీసెస్ గార్డులకు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి సూచించారు. కాకతీయ యూనివర్సిటీలో నూతనంగా సెక్యూరిటీ సర్వీసెస్‌కు విధులు అప్పగించారు. విధుల్లో చేరిన సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్లతో క్యాంపస్‌లోని క్రీడా మైదానంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీలోకి వచ్చే విద్యార్థులు, ఉద్యోగుల ఐడెంటిటీ కార్డులను పరిశీలించాలని సూచించారు. తొలిసారిగా మహిళా సెక్యూరిటీ గార్డులను కూడా నియమించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో కేయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్లు ప్రణయ్‌కుమార్, డాక్టర్ వల్లాల పృథ్వీరాజ్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సెక్యూరిటీ ఆఫీసర్ దేవదాస్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తత అవసరం

హన్మకొండ: విద్యుత్ ప్రమాదాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ కార్యాలయం డీఈ (టెక్నికల్), హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి సూచించారు. హనుమకొండ న్యూశాయంపేట శివారులో పొలంబాట కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోటార్లకు కెపాసిటర్లు బిగించుకుంటే విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు ఉండవని తెలిపారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా మోటార్లు, స్టాటర్‌లకు ఎర్తింగ్ చేసుకోవాలని చెప్పారు. రైతులు సొంతంగా మరమ్మతులు చేసుకోవద్దని, అనుభవమున్న ఎలక్ట్రీషియన్,



పొలంబాటలో విద్యుత్ అధికారులు, రైతులు

విద్యుత్ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో హనుమకొండ ఏడీఈ మల్లికార్జున్, ఏఈ నవీన్, లైన్‌మెన్ రాంరెడ్డి, స్థానిక రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివక్ష



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: ఓబీసీల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపుతూ, బీసీ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్ విమర్శించారు. ఈనెల 7న పంజాబ్ రాష్ట్రం అమృత్‌సర్‌లో జరగనున్న జాతీయ ఓబీసీ మహాసభ వాల్‌పోస్టర్లను హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన 10 వేల మంది ముఖ్య డెలిగేట్లతో అమృత్‌సర్‌లో జాతీయ ఓబీసీ 9వ మహాసభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కులగణన చేపట్టి బీసీల లెక్క తేల్చాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్ అమలు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో మహాసభను నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లయ్య యాదవ్, బచ్చు ఆనందం, అన్నారపు యాకయ్య, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి తౌటం రవీందర్, శోభారాణి, విద్యాసాగర్, వెంకటేశ్వర్లు, అశోక్ గౌడ్, నాగరాజు, బాలాజీ, దేశిని ఐలయ్య, పవన్, రాజేష్, యాకయ్య, నాగరాజు పాల్గొన్నారు.

కులగణన హామీని అమలు చేయాలి

కాజీపేట: ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కులగణన హామీని అమలు చేయాలని తెలంగాణ బీసీ ప్రజా సంఘాల జేఏసీ చైర్మన్ కోలా జనార్దన్ డిమాండ్ చేశారు. కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కులాల వారీగా రాజకీయ ప్రాతినిధ్యం, బడ్జెట్ కేటాయింపులు చేస్తామని జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ.. ఆ దిశగా ఆలోచన చేయకపోవడం బాధాకరమని వాపోయారు. రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ చేసిన విషయాన్ని గుర్తించి వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. సమావేశంలో సాధినేని సుధాకర్, పోలపెల్లి రాంమూర్తి, పి.శివకుమార్, తేలు సారంగపాణి, దువ్వ కనకరాజ్, పాము రాజేష్, మాచర్ల శరత్‌చంద్ర, వీరస్వామి, కాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్థాయికి మించి వైద్యం చేయొద్దు

ఖిలా వరంగల్: ఆర్ఎంపీలు, పీఎంపీలు తమ స్థాయికి మించిన వైద్యం చేయొద్దని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఆర్ఎంపీ, పీఎంపీ సంఘాల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్ఎన్.హరిబాబు సూచించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర శ్రీనివాస్ అధ్యక్షతన వరంగల్ రంగశాయిపేటలోని పద్మశాలి భవనంలో మండల కమిటీ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ వైద్య సేవలు అందుబాటులో లేని గ్రామీణ ప్రజలకు వైద్య సేవలందిస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీలపై మెడికల్ కౌన్సిల్ సభ్యులు దాడి చేసి కేసులు నమోదు చేయటం సరికాదని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రామగోని శ్యాంప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఏ.వెంకటేశ్వర్లు, బి.మహేందర్, ప్రధాన



శ్యాంప్రసాద్‌ను సన్మానిస్తున్న హరిబాబు, తదితరులు

కార్యదర్శిగా రాజేంద్రప్రసాద్, సంయుక్త కార్యదర్శులుగా శ్రీనివాస్, రవికుమార్, వెంకటేష్, కోశాధికారిగా సుధాకర్, సలహాదారులుగా రమేష్, ఆర్గనైజర్లుగా యాకయ్య, నవీన్‌కుమార్, సభ్యులుగా లింగమూర్తి, రమేష్‌బాబు, విద్యాసాగర్, సంజీవ, సమ్మయ్య, హరిప్రసాద్, శ్రీనివాస్, రమేష్, పాషా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ వైద్య ప్రతినిధులు బండి రమేష్, రాజిరెడ్డి, రమేష్, గజ్జెల్లి రవీందర్, హనుమయ్య, కైలాసం పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి సహకరించాలి



నయీంనగర్: వరంగల్ నగర అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి కోరారు. ఎమ్మెల్యేల సహకారంతో ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కుడా కార్యాలయంలో టీజీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు కారం రవీందర్‌రెడ్డి, టీజీఓ సభ్యులు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కోఆపరేటివ్ అధికారి సంజీవరెడ్డి, టీజీఓ నాయకులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, ఈగ వెంకటేశ్వర్లు, నాగ నారాయణ, కిరణ్‌కుమార్, కోల రాజేష్‌కుమార్, రాంరెడ్డి, వాల్యా నాయక్, రత్నవీరాచారి, సుమలత, రాజేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేయర్‌ను కలిసిన డిప్యూటీ కమిషనర్, పన్నుల అధికారి



మేయర్‌కు మొక్క అందిస్తున్న ప్రసన్నరాణి, శ్రీనివాస్

వరంగల్: రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు బదిలీపై వచ్చిన డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, పన్నుల అధికారి బిర్రు శ్రీనివాస్, డీఈ రాజ్‌కుమార్, టెక్నికల్ అధికారి గౌతమి గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం, నగర మేయర్ గుండు సుధారాణిని బల్దియా ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా వారికి మేయర్ శుభాకాంక్షలు తెలిపి సమర్థవంతంగా విధులు నిర్వర్తించి ఉత్తమ అధికారులుగా గుర్తింపు పొందాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై హర్షం



ఎస్సీ వర్గీకరణ తీర్పుపై ఎస్సీ కుల సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు నగర వ్యాప్తంగా గురువారం సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు సుప్రీం కోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. మంద కృష్ణమాదిగ పోరాట ఫలితంగా మూడు దశాబ్దాల కల నెరవేరనుందని కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్

మెట్టుగుట్టపై ముగిసిన పవిత్రోత్సవాలు

మడికొండ: మెట్టుగుట్టపై రెండు రోజులుగా జరుగుతున్న పవిత్రోత్సవాలు గురువారం ముగిశాయి. ఉదయం 8గంటలకు విష్వక్సేన పూజ, పుణ్యాహం, అగ్ని ఆరాధన, ఉక్తహోమం, శ్రీవారి స్నపన తిరుమంజనం, పవిత్ర అభిమంత్రణ, సమర్పణ, నీరాజనం, సాయంత్రం 6గంటలకు సాయంసవనం, మహాశాంతి, తదుక్త హోమాలు, అష్టాక్షరి మూలమంత్ర హోమాలు, కుంభ అభిమర్శనం, కుంభారోపణ, దర్శనం, నీరాజనాలను అర్చకులు విష్ణువర్ధనాచార్యులు, సత్యనారాయణ శర్మ మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో శివాలయం చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, దండిగం శ్రీనివాస్, బైరి రాజు, జ్ఞానేశ్వరి, వస్కుల ఉమ, ఆలయ సిబ్బంది,



పవిత్రోత్సవంలో అర్చకులు, భక్తులు

భక్తులు పాల్గొన్నారు. ఈనెల 5నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు శ్రావణమాసం సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి ఒక ప్రకటనలో తెలిపారు. పూజలు చేసేందుకు భక్తులు రూ.1116 శివాలయంలో, రామాలయంలో రూ.1016లు చెల్లించి రశీదు పొందాలని పేర్కొన్నారు.

భారీ వాహనాలు గ్రామంలోకి రావొద్దని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న మడికొండ గ్రామస్తులు

మడికొండ: భారీ వాహనాలను మడికొండ గ్రామంలోకి రాకుండా చూడాలని అధికారులను గ్రామస్తులు కోరారు. ఈమేరకు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ఇటీవల ప్రైవేట్ స్కూల్ బస్సును లారీ ఢీకొట్టిన సంఘటనలో విద్యార్థులు స్వల్ప గాయలతో బయటపడ్డారని, అలాగే, నెల రోజుల క్రితం పెద్దమ్మ ఆలయం వద్ద రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడని, గతేడాది ఓ ఇంటిపైకి భారీ వాహనం దూసుకొచ్చిందని తెలిపారు. భారీ వాహనాల కారణంగా రోడ్లు అధ్వానంగా మారుతున్నాయని వాపోయారు. ఈ విషయాలను పోలీసులు, అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉదయం 6గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు భారీ వాహనాలు గ్రామంలోకి రాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు దువ్వ నవీన్, పొనగోటి వెంకట్‌రావు, గద్దం మహేందర్, బొల్లికొండ వినోద్, దువ్వ కొమురయ్య, కిషన్, ఎలగొండ శివ, మాచర్ల రంజిత్, నర్ర నరేష్, బోగి మహేందర్, మినుగు సతీష్, విజయ్, అజయ్, రాజ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జీఎంహెచ్‌లో తల్లిపాల వారోత్సవాలు

హన్మకొండ చౌరస్తా: అప్పుడే పుట్టిన చిన్నారి నుంచి ఆరు నెలల పాపాయి వరకు తల్లిపాలను మాత్రమే తాగించాలని హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. ఆగస్టు 1నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆస్పత్రిలో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ముర్రుపాలు ప్రాధాన్యతపై గురువారం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముర్రుపాలు చిన్నారులకు సంజీవని లాంటివని వివరించారు. కార్యక్రమంలో పిడియాట్రీషియన్ వినోద్‌కుమార్,



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న వైద్యులు, సిబ్బంది

వైద్యులు ఇఫ్కర్ అహ్మద్, గీత, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ సుమలత, సూపర్‌వైజర్ రాజేశ్వరి, రామేశ్వరి, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీతోనే ఉజ్వల భవిష్యత్



సమావేశంలో మాట్లాడుతున్న తాళ్ల మల్లేశం

ఖిలా వరంగల్: బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఫార్మడీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని తాళ్ల పద్మావతి విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం అన్నారు. వరంగల్ హంటర్ రోడ్డులోని తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో ఒమెగా హెల్త్ కేర్, హెటిరో, అపోలో ఫార్మసీ, ఏజీ హెల్త్ కేర్, ఇతర కంపెనీల ఆధ్వర్యంలో ఫార్మసీ విభాగం ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన గురువారం మెగా ఫార్మా రిక్రూట్‌మెంట్ డ్రైవ్ జరిగింది. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాలలో నాణ్యమైన విద్య అందుతోందని అన్నారు. అనంతరం ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో అవొద్ద సంస్థ ప్రతినిధి మాలోత్ ప్రవీణ్, కొలంబో మెడికల్ కళాశాల, ఆస్పత్రి డైరెక్టర్ చిన్నప్పరెడ్డి, డాక్టర్ పుష్పి, పలు ఫార్మసీ కళాశాల యజమానులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వ్యవసాయ కార్మిక సమగ్ర చట్టం చేయాలి

న్యూశాయంపేట: దేశంలో కోట్లాది మంది వ్యవసాయ కార్మికులు ఎలాంటి హక్కులు లేకుండా దుర్భరంగా జీవిస్తున్నారని, కేంద్రం తక్షణమే స్పందించి వ్యవసాయ కార్మిక సమగ్ర చట్టాన్ని చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు టి.వెంకట్రాములు డిమాండ్ చేశారు. బాలసముద్రంలోని కార్యాలయంలో కార్మిక సంఘం కార్యకర్తల సమావేశం తిరుపతి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ వేములవాడలో ఈనెల 3, 4వ తేదీల్లో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్రస్థాయి శిక్షణ శిబిరాలు జరగనున్నాయని ఆయన వివరించారు. ఈ సమావేశంలో నాయకులు లింగారెడ్డి, ఎల్లేశ్, లక్ష్మణ్, భిక్షపతి, రాజమణి, మధునమ్మ, మహేందర్, స్వామి, మహేశ్, శిరీష, పద్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కష్టాల్లోంచి పుట్టిందే పాట

ఖిలా వరంగల్: కష్టాల్లోంచి పుట్టిందే పాట అని తెలంగాణ ప్రజానాట్య మండలి జిల్లా బాధ్యుడు గన్నారపు రమేష్ అన్నారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో నాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షురాలు బత్తుల సుప్రియ అధ్యక్షతన గురువారం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నిజాంకు వ్యతిరేకంగా గ్రామీణ ప్రాంతాల ప్రజలను ఒకేతాటిపై నడిపించింది ప్రజా నాట్యమండలి కళాకారులు పాడిన పాటలేనని గుర్తుచేశారు. ప్రజల కష్టాల నుంచి పుట్టిన పాటలు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని విజయవంతం చేశాయని అన్నారు. మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, మున్నీ, యాదగిరి, సుమలత, స్వప్న, సుకన్న, మనోహర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

కాజీపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి వారం రోజుల పాటు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి ఓ వ్యక్తి తుది శ్వాస విడిచాడు. కాజీపేట సీఐ సుధాకర్ రెడ్డి కథనం ప్రకారం 61వ డివిజన్ ప్రశాంత్ నగర్ కాలనీకి చెందిన ఎస్‌డి.అలీ (40) జూలై 25న నిట్ వద్ద ద్విచక్ర వాహనంపై రోడ్డు క్రాస్ చేస్తుండగా గుర్తు తెలియని ఆటో ఢీకొట్టి వెళ్లింది. దాంతో అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడి కుమారుడు ఇదిరాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్దాలి

హన్మకొండ: విద్యార్థులను చదువుతో పాటు అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దాలని కేంద్రీయ విశ్వవిద్యాలయ సంఘటన్ రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్, ట్రైనింగ్ రిసోర్స్ పర్సన్ పివి.సాయి రంగారావు సూచించారు. హనుమకొండ విద్యానగర్‌లోని సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్‌లో సీబీఎస్ఈ ఉపాధ్యాయులకు కెపాసిటీ బిల్డింగ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ విద్యార్థులు మట్టి ముద్ద లాంటి వారని, తాము ఏరూపంలో మారిస్తే వారు అలా తయారవుతారని చెప్పారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు మెళకువలు, విలువలతో కూడిన విద్యను అందించాలని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఎస్.అజయ్‌పాల్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శంకరాచార్య, సెయింట్ పీటర్స్ ఎడ్యు స్కూల్ చైర్మన్ ఎస్.అజయ్‌పాల్ రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు ఎస్.హరిత, ఉపాధ్యాయులు వి.వి.రంగారావు, మధు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

వరంగల్: వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలని బల్దియా బయాలజిస్ట్ మాధవరెడ్డి తెలిపారు. దోమలు, ఈగలు వల్ల ప్రబలే వ్యాధుల గురించి వరంగల్ దేశాయిపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ధరంసింగ్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధుకర్, బలభద్ర రవి, తదితరులు పాల్గొన్నారు.

శిక్షాసాగర్ ఫౌండేషన్ సభ్యుడిగా రవికుమార్



హన్మకొండ: గుజరాత్‌కు చెందిన శిక్షాసాగర్ ఫౌండేషన్ సభ్యుడిగా వెనిశెట్టి రవికుమార్‌ను నియమించారు. ఈమేరకు శిక్షాసాగర్ ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి శైలేష్ కుమార్ గురువారం నియామక ఉత్తర్వులు జారీచేశారు. హనుమకొండ మండలం పలివేల్పుల ప్రాథమిక ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రవికుమార్‌ను తెలంగాణ నుంచి ఈ పదవిలో నియమించారు.

వంగపహాడ్‌లో పోలీసుల తనిఖీలు

హసన్‌పర్తి: కాజీపేట ఏసీపీ తిరుమల్ ఆధ్వర్యంలో హసన్‌పర్తి మండలం వంగపహాడ్ గ్రామంలో పోలీసులు గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ సందర్భంగా మైనర్లు డ్రైవింగ్ చేస్తూ పోలీసులకు చిక్కగా వారిని పోలీసులు హెచ్చరించారు. అలాగే, వేశ్యగృహ నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వ్యభిచార కార్యకలాపాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఆదేశించారు. కార్యక్రమంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఎస్సై దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

బార్ అండ్ రెస్టారెంట్‌లో తనిఖీలు

రామన్నపేట: వరంగల్‌లోని శ్రావణి బార్ అండ్ రెస్టారెంట్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు గురువారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలం చెల్లిన చేప మాంసాన్ని గుర్తించారు. సరైన ఆరోగ్య ప్రమాణాలు పాటించని బార్ యజమానికి నోటీసులు జారీ చేశారు.

కార్మికులు లేబర్‌కార్డులు కలిగి ఉండాలి



కాజీపేట అర్బన్: కార్మికులందరూ తప్పకుండా లేబర్ కార్డు కలిగి ఉండాలని శ్రమశక్తి అవార్డు గ్రహీత కుసుమ శ్యాంసుందర్ సూచించారు. హంటర్‌రోడ్డులోని వైభవ్ ఎంటర్‌ప్రైజెస్‌లో పనిచేస్తున్న కార్మికులకు వైభవ్ ఎంటర్‌ప్రైజెస్ యజమాని గుండేటి నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన లేబర్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో శ్యాంసుందర్ పాల్గొని కార్డులను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకునేందుకు లేబర్ కార్డు దోహదపడుతుందని అన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చిప్ప వెంకటేశ్వర్లు, ఆశీర్వాద పైప్స్ సేల్స్ మేనేజర్ రాజేష్, నీలిమ, కనకయ్య, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.